ఆఖరి మజిలీకీ అవస్థలే!

- ఎస్ఎన్‌పురంలో ప్రశ్నార్థకంగా కర్మల భవన నిర్మాణం
- కర్మకాండలకు స్థలం లేక ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- కౌన్సిల్‌లో తీర్మానం పొందినా ముందుకు సాగని పనులు


సత్యనారాయణపురంలోని జీఎస్ రాజురోడ్డులో కర్మల భవనం నిర్మాణం చేపట్టాల్సిన స్థలం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలో కర్మకాండలు చేసుకునేందుకు స్థలం లేక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సుమారు 40 ఏళ్ల క్రితం స్థానిక జీఎస్ రాజు రోడ్డులో ఏర్పాటు చేసిన కర్మల భవనం శిథిలావస్థకు చేరుకుని, అందులోని షెడ్లు, నిర్మాణాలు కూలిపోయాయి. దీంతో ఆ ప్రాంత నివాసితుల్లో ఎవరైన మృతిచెందితే వారికి కర్మకాండలు చేసుకునేందుకు ఎటువంటి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై స్థానిక 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి శిథిలమైన కర్మల భవనం స్థానంలో నూతన భవనం నిర్మాణం చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగించాలని 2021 ఏప్రిల్, 17వ తేదీన నగర పాలకసంస్థ కౌన్సిల్‌లో తొలిసారిగా ప్రతిపాదనలు పెట్టడం జరిగింది. ఆ సమయంలో వీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు కర్మల భవనం నిర్మాణానికి రూ.1.63 కోట్లతో అంచనాలు తయారు చేశారు. అయితే ఒక్క కర్మల భవనానికే అంత నిధులు వెచ్చించలేమంటూ నగరపాలకసంస్థ చేతులెత్తేసింది.

వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి..

సత్యనారాయణపురంతో పాటు పరిసర ప్రాంతంలోని 40వేల మంది జనాభాకు ఉపయోగంగా ఉండే కర్మల భవనం శిథిలావస్థకు చేరుకోవడం, దాని స్థానంలో నూతన భవనం నిర్మాణం పనులు చేపట్టకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో అద్దె ఇళ్లలో ఉండేవారే ఎక్కువ. వారి కుటుంబ సభ్యులు కాలం చేస్తే వారి ఇళ్ల వద్ద కర్మకాండలు చేసుకునే అవకాశం లేకపోవడంతో దూరప్రాంతాలకు వెళ్లి ఆ కార్యక్రమాలను ముగించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు ఆ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన కర్మల భవనం నిర్మాణం చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణానికి ముందుకు వచ్చిన ఎన్‌జీఓ సంస్థ.. కానీ..

సత్యనారాయణపురంలో ప్రజల ఇబ్బందులను గుర్తించిన ఒక ఎన్‌జీఓ సంస్థ సేవా దృక్పథంతో రూ.2కోట్లతో కర్మల భవనం నిర్మాణం చేపట్టేందుకు ముందుకు వచ్చింది. లీజు పద్ధతిలో ఖర్మల భవనం స్థలంలో నిర్మాణాలు, నిర్వహణను చేపట్టి నామమాత్రపు ఫీజుతో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పింది. దీనిపై కార్పొరేటర్ శర్వాణీమూర్తి తిరిగి 2023, ఏప్రిల్ 27వ తేదీన జరిగిన కౌన్సిల్ సమావేశంలో కర్మల భవన నిర్మాణం ఎన్‌జీఓ సంస్థకు అప్పగించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదనలు పెట్టడంతో ఆమోదం లభించింది. దీంతో దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న తమ సమస్యకు ఒక పరిష్కారం దొరికినందుకు స్థానికులు హర్షం చేశారు. కానీ ఈ ప్రతిపాదనలో పలు సమస్యలు ఉన్నాయని నగరపాలకసంస్థ రద్దు చేయడంతో సమస్య మళ్లీ మొదటికి రావడంతో స్థానికులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

కలగానే మిగిలిపోయింది



వీఎంసీ కర్మల భవనానికి నిధులు కేటాయించలేమని స్పష్టం చేయడంతో ఓ ఎన్‌జీఓ సంస్థ ద్వారా నిర్మాణం చేపట్టాలని కౌన్సిల్‌లో తీర్మానం చేసి ఆమోదం పొందడం జరిగింది. కాని పలు కారణాలతో వీఎంసీ ఆ తీర్మానాన్ని రద్దు చేసింది. దీంతో స్థానికుల చిరకాల కోరిక కలగానే మిగిలిపోయింది. ఇప్పటికైనా వీఎంసీ అధికారులు సత్యనారాయణపురం ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కర్మల భవనం నిర్మించాలి.

– శర్వాణీమూర్తి, 33వ డివిజన్ కార్పొరేటర్

క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



పాయకాపురం(విజయవాడరూరల్): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్య సిబ్బంది, శానిటరీ సిబ్బంది, ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. 64వ డివిజన్లో డ్రైడే, ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. కండ్రిక, ప్రజాశక్తినగర్, కొండాలమ్మగుడి రోడ్డు, పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. డబ్బాల్లో, కొబ్బరిబొండాల్లో, రోళ్లు, టైర్లలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అలాగే ఫ్రిడ్జిలలో, కూలర్లలో కూడా నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపిరాజు, ఏఎన్ఎంలు నీరజ, రత్నకుమారి, హెల్త్ సెక్రటరీ లలితా బార్గవి, మేరీరాణి తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మీదేవిగా అన్నపూర్ణాదేవి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): శ్రావణమాసం ఆఖరి శుక్రవారాన్ని పురస్కరించుకొని సత్యనారాయణపురంలోని శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైయున్న శ్రీ కాశీ అన్నపూర్ణాదేవి శ్రీ వరలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు తెల్లవాజాము నుంచే కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. 108 మంది సువాసినులు పాల్గొని అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వేగంగా బుడమేరు ఆధునికీకరణ పనులు



పాయకాపురం(విజయవాడరూరల్): ప్రభుత్వం బుడమేరు ఆధునికీకరణ చేపట్టిందని, యుద్ధ ప్రాతిపదికన వెలగలేరు గేట్లను రిపేరు చేసిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కండ్రిక నుంచి గుణదల 33 తూముల వరకు బుడమేరు కాలువలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర పర్యవేక్షణలో వెలగలేరు నుంచి 33 తూముల వరకు కాలువల ఆధునికీకరణ పూర్తయ్యిందన్నారు. మొన్న బుడమేరు కాలువలో గుర్రపుడెక్కను తొలగించేందుకు పడవలు వస్తే సోషల్ మీడియాలో వేరే రీతిలో చూపించి ప్రజలను భయపెట్టే ప్రయత్నం జరిగిందన్నారు. ఎమ్మెల్యేతో పాటు వీఎంసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, ఏఈ మాధవ్ ఉన్నారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): అత్తింటి వేధింపులపై వివాహిత కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా, శుక్రవారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీకి చెందిన ఊయల నందిని, పల్లయ్య భార్యాభర్తలు. వీరిది ప్రేమ వివాహం కాగా ఒక కుమార్తె. అయితే కొంత కాలంగా పల్లయ్య భార్యను కట్నం డబ్బుల కోసం వేధింపులకు గురి చేయడమే కాకుండా పుట్టింటికి పంపేశాడు. భార్య పుట్టింటికి వెళ్లిన మూడు నెలలకు విడాకుల నోటీసులు పంపగా, కాపురానికి తీసుకువెళ్లాలని నందిని కోరింది. అయితే కాపురానికి తీసుకువెళ్లకుండా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఇదే విషయాన్ని అత్త, మామయ్యలకు చెప్పినా ప్రయోజనం లేకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

పాయకాపురం(విజయవాడరూరల్): కుమార్తె కనిపించడం లేదని తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాయకాపురం ఎల్‌బీఎస్ నగర్‌కు చెందిన మేకల కాశీరత్నం కుమార్తె(19) ఇంటర్ చదువుకొని ఇంటి వద్ద ఉంటోంది. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని, ఆమె గురించి అనేక చోట్ల విచారించినా ఆచూకీ దొరకలేదని తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మాదక ద్రవ్యాలతో నేరాల రేటు పెరుగుదల


మాట్లాడుతున్న ఈగల్ టీం ఎస్ఐ వీరాంజనేయులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీం ఎస్ఐ వీరాంజనేయులు అన్నారు. కృష్ణలంకలోని పొట్టిశ్రీరాములు ప్రభుత్వ జూనియర్ కళాశాల, పొట్టి శ్రీరాములు నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శుక్రవారం మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరాంజనేయులు మాట్లాడుతూ మాదకద్రవ్యాలు వినియోగంతో నేరాల రేటు పెరుగుతుందని తెలిపారు. సమాజంపై హానికరమైన ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు అలవాటుపడి బంగారంలాంటి భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్, గంజాయి, కొకైన్ విక్రయిస్తున్నట్లు తెలిస్తే పోలీసులకు గానీ, 1972 నంబర్‌కు గానీ సమాచారం అందించాలని కోరారు. కృష్ణలంక పీఎస్ ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ మత్తుపదార్థాల వ్యసనం తీవ్రమైన ఆందోళనకరంగా మారుతుందని పేర్కొన్నారు. పూర్తి అవగాహనతో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించవచ్చని స్పష్టం చేశారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జి.శేఖర్‌బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను, యువతను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకురావచ్చన్నారు. ఈ సమస్యలతో బాధపడుతున్న విద్యార్థులకు, యువతకు నూజివీడు మండలం పోలసానపల్లిలో ఏర్పాటు చేసిన బోస్కో డీ అడిక్షన్ కేంద్రాన్ని ఉచితంగా సంప్రదించవచ్చని తెలిపారు. ఇతర వివరాలకు 94904 92020 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోటేశ్వరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్, అధ్యాపకులు ఉషారాణి, ప్రసాద్, నవజీవన్ బాలభవన్ జోనల్ కో ఆర్డినేటర్ ఎస్‌కే నజ్మా, జాకబ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జిల్లాలో యూరియా, ఇతర ఎరువులు పక్కదారి పట్టకుండా ప్రత్యేక బృందాలతో విస్తృత తనిఖీలు చేపడతామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. ఎరువుల సరఫరాపై నిరంతర నిఘాతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎరువుల సరఫరాపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి శుక్రవారం అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వీసీకి కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. ఎరువులు సమృద్ధిగా ఉన్న నేపథ్యంలో ఎక్కడా పక్కదారి పట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మంత్రి, సీఎస్ దిశానిర్దేశం చేశారు. కృత్రిమ కొరత సృష్టించినా, దారి మళ్లించినా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో మాట్లాడుతూ రైతులు అవసరం మేరకు మాత్రమే ఎరువులు తీసుకునేలా, నానో యూరియా, ఇతర నానో ఎరువులపైనా పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం 4,786 మెట్రిక్ టన్నుల యూరియాతో పాటు డీఏపీ, ఎంవోపీ, ఎస్ఎస్‌పీ కాంప్లెక్స్.. ఇలా మొత్తం 21,374 మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ఎరువులు సరఫరాపై ఫిర్యాదులు లేదా సమాచారం అందించేందుకు కలెక్టరేట్‌లో 91549 70454తో కంట్రోల్ రూమ్ అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డీఎంఎఫ్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

భార్యను కలవనీయడం లేదని అత్తమామలపై దాడి


ఆస్పత్రిలో గాయాలతో వెంకటరెడ్డి


గాయత్రి తల్లి రమా పనిచేస్తున్న షాపు వద్దకు వెళ్లి ఆమెపై దాడికి పాల్పడుతున్న మణికంఠ సీసీ ఫుటేజీ

సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించిన బాధితులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): తన భార్యను కలవనీయడం లేదనే అక్కసుతో ఓ వ్యక్తి తన అత్తా.. మామలపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం.. అజిత్ సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవినగర్ మధ్యకట్ట ప్రాంతంలో నివసిస్తున్న మొర వెంకటరెడ్డి(50), రమా(45) అనే దంపతులు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు సంతానం. నిరుపేద కుటుంబం కావడంతో కుమార్తె గాయత్రి(20)ని పదో తరగతి వరకూ చదివించి ఆ తరువాత ఓ ప్రైవేటు కంపెనీలో పనికి పంపుతున్నారు. అయితే వారి ఇంటికి సమీపంలో ఉండే మణికంఠ అనే యువకుడు గాయత్రిని ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని దగ్గరై కొన్ని నెలల క్రితం ఓ గుడిలోకి తీసుకువెళ్లి ఆమెకు తాళి కట్టాడు. ఆ తరువాత నుంచి మణికంఠ నిత్యం మద్యం, గంజాయి తాగి వస్తూ గాయత్రిని వేధింపులకు గురిచేస్తున్నాడు. అతని చేష్టలతో విసిగిపోయిన ఆమె అతనితో ఉండలేక తన తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది.

గంజాయి బ్యాచ్‌తో కలిసి..

అయితే మణికంఠ పూటుగా మద్యం, గంజాయి తాగి వారి ఇంటివద్దకు వచ్చి గొడవలు పడేవాడు. ఎంత చెప్పినా వినకుండా గాయత్రి పనిచేస్తున్న కంపెనీ వద్దకు కూడా అల్లరి చేయడంతో వారు ఆమెను పనిలో నుంచి తీసివేశారు. దీంతో అతగాడి చేష్టలతో భయపడిపోయిన ఆమె గాంధీనగర్‌లోని ఓ హాస్టల్‌లో తలదాచుకుంటూ అతనికి దూరంగా ఉంటోంది. అయితే ఈ నెల 12వ తేదీన మణికంఠ తన అత్త రమా పనిచేసే షాపు వద్దకు వెళ్లి ఆమెతో గొడవపడి ఆమెను కొట్టి వెళ్లిపోయాడు. ఈ నెల 21వ తేదీన తన మామయ్య వెంకటరెడ్డి శ్రీదేవి బార్ దగ్గర నుంచి ఇంటికి వెళ్తుండగా గంజాయి బ్యాచ్ సభ్యులతో కలిసి ఆయనను అడ్డగించిన మణికంఠ, అతనిపై విచక్షణా రహితంగా దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో వెంకటరెడ్డికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు అతన్ని చికిత్స నిమిత్తం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న గాయత్రి తన తల్లిదండ్రులను తీసుకొని వచ్చి శుక్రవారం సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. మణికంఠ, గంజాయి బ్యాచ్ సభ్యుల నుంచి తమకు రక్షణ కల్పించాలని బాధితులు ప్రాథేయపడుతున్నారు.

నేడు పోక్సో చట్టంపై శిక్షణ

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో శనివారం బెంజిసర్కిల్ వద్ద కార్యాలయంలో ఉదయం 11 గంటలకు పోక్సో యాక్ట్‌పై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ బి.కీర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పోక్సో కోర్ట్ స్పెషల్ జడ్జి వేల్పుల భవానీ పాల్గొని జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ కార్యక్రమంలో భాగంగా ఐసీపీఎస్, ఐసీడీఎస్, టీచర్స్, మహిళా సంరక్షకురాళ్లు, వలంటీర్లకు పోక్సో చట్టాలు, పిల్లలపై జరిగే అమానుషాలు, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలను నిర్మూలించడం తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

రేపు జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు

కృష్ణలంక(విజయవాడతూర్పు): నగరంలోని రాఘవయ్య పార్కు సమీపంలో ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ఈ నెల 24వ తేదీన ప్రజా ఆరోగ్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు నిర్వహిస్తున్నామని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.వి.రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ పెరుగుదల-నివారణ పద్ధతులు, ఆరోగ్యరంగ ప్రైవేటీకరణ-ప్రభావాలు- పరిష్కారాలు అనే అంశాలపై సదస్సు ఏర్పాటుచేశామని పేర్కొన్నారు. ఈ సదస్సులో ప్రముఖ డాక్టర్లు, ప్రొఫెసర్లు పాల్గొని రాష్ట్రంలో ప్రజా ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయడం, అందరికీ సమాన ఆరోగ్య సేవలు అందించడం, ఆరోగ్యశ్రీని బలోపేతం చేయడం, వైద్య ఆరోగ్య రంగ ప్రైవేటీకరణ ప్రభావాలు, క్యాన్సర్ నివారణ, ముందస్తు గుర్తింపు, జీవనశైలిలో మార్పులపై ప్రసంగిస్తారని చెప్పారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకట్రావు


మాట్లాడుతున్న వెంకటరావు

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): నూతనంగా పరిశ్రమల స్థాపించాలనుకునే వారు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో అందిస్తున్న ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఆర్.వెంకటరావు చెప్పారు. స్థానిక రావిచెట్టు సెంటర్‌లో ఉన్న జనశిక్షణ సంస్థాన్ కార్యాలయం ఆవరణలో పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనే యువతకు అవగాహన సదస్సు శుక్రవారం నిర్వహించారు. వెంకటరావు మాట్లాడుతూ జనశిక్షణ సంస్థాన్‌లో వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న వారు పారిశ్రామిక వేత్తలుగా ఎదగవచ్చని చెప్పారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లోనూ ముందంజలో ఉన్నారని తెలిపారు. స్వయం ఉపాధి కోర్సులు నేర్చుకున్న వారు నిధులు లేకపోవడం వల్ల సొంతంగా ఉత్పత్తి చేయలేకపోతున్నారని పేర్కొన్నారు. అటువంటి వారి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాల పేరుతో సబ్సిడీతో రుణాలను మంజూరు చేయిస్తున్నాయని వెల్లడించారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకంలో భాగంగా లక్ష నుంచి రూ.50 లక్షల వరకు రుణాలను పొందవచ్చునని వివరించారు. ఇందులో 35 శాతం వరకు రాయితీ ఇస్తోందన్నారు. ఈ పథకానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునని తెలియజేశారు. జనశిక్షణ సంస్థాన్ చైర్‌పర్సన్ విద్యాకన్నా మాట్లాడుతూ వృత్తి విద్యా కోర్సులను నేర్చుకున్న వారు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని జీవితంలో స్థిరపడాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్స్, ఎస్వీ సత్యనారాయణ, ఎం.లావణ్య, జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల క్షేమమే ప్రధాన ధ్యేయం

కమిషనర్ ధ్యానచంద్ర


డ్రెయిన్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయమని, విజయవాడ నగరంలోని మేజర్ ఔట్‌ఫాల్ డ్రెయిన్స్ అన్నిటికీ రెయిలింగ్స్ పెట్టాలని, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. కొత్తపేట, పంజా సెంట్రర్, డ్రెయిన్‌వీధి, సుబ్బరామయ్య వీధి, గాంధీ హిల్, గవర్నర్‌పేట వెహికల్ డిపో ప్రాంతాల్లో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే నగరంలో మేజర్ ఔట్ ఫాల్ డ్రెయిన్స్‌కి రెయిలింగ్స్ పెట్టే పనులు మొదలైనప్పటికీ పూర్తి స్థాయిలో పనులను చేయాలని సూచించారు. గాంధీ హిల్ వద్ద ఎస్కలేటర్ ద్వారా జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. రైలింగ్స్ పెట్టేటప్పుడు డీసిల్టింగ్ పనులకు ఇబ్బంది లేకుండా వాటికి నాలా మ్యాన్ సరిపోయేంత దూరంలో ఒక గేటును అమర్చాలని తెలిపారు. పర్యవేక్షణ ఇంజినీర్ పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జె. శ్రీనివాస్, డెప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ అన్నపూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేడియంలో వసతులు పెంచండి


ప్రమాదకరమైన స్థితిలో ఉన్న గదులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ నిర్వహణలో ఉండే స్టేడియాల్లో వసతులను పెంచాలని, పాతవి పాడైపోయిన ప్రమాదకరమైన భవనాలను, గదులను సీజ్ చేయాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. బందర్ రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు స్టేడియంను శుక్రవారం ఆయన పరిశీలించారు. స్టేడియంలో ఆడుకునేందుకు వచ్చేవారి కోసం మరిన్ని వసతుల్ని పెంచాలని, స్కేటింగ్ రింక్‌ను అభివృద్ధి చేయాలని ఆదేశించారు. స్టేడియంలో ప్రమాదకరమైన మూడు గదులను గుర్తించారు. అందులో ఒక గదిని వెంటనే సీజ్ చేసి అందులోకి ఎవరూ వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంజినీర్లు స్ట్రక్చరల్స్ స్టెబిలిటీ చూసి, వాటిపై సరైన చర్యలు తీసుకోవాలని, స్టేడియం ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని, పారిశుధ్య నిర్వహణలో సక్రమంగా ఉండాలని చెప్పారు. ఈ పర్యటనలో ఎస్టేట్ ఆఫీసర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ స్పోర్ట్స్ డాక్టర్ ఎ.శ్రీధర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సామ్రాజ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్య రహిత డివిజనే లక్ష్యం


చల్లపల్లివారివీధిలో నూతన యూజీడీ పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శర్వాణీమూర్తి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): సమస్య రహిత డివిజన్‌గా తీర్చిదిద్దటమే లక్ష్యంగా డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు 33వ డివిజన్ కార్పొరేటర్ శర్వాణీమూర్తి పేర్కొన్నారు. శుక్రవారం సత్యనారాయణపురంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న యూజీడీ నూతన నిర్మాణ పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల డివిజన్ పర్యటనల్లో భాష్యం స్కూల్ రోడ్డు, తిరుమలరాజువీధి, చల్లపల్లివారివీధుల్లో దశాబ్దాల క్రితం వేసిన యూజీడీ దెబ్బతిని మురుగునీటి పారుదల నిలిచిపోయి మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లుతున్నాయని స్థానికులు తన దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. దీనిపై నగరపాలకసంస్థ కౌన్సిల్‌లో ప్రతిపాదనలు పెట్టి రూ.12లక్షలతో ఆయా వీధుల్లో నూతన యూజీడీ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. డివిజన్ ప్రజలు ఏమైన సమస్యలు ఉంటే 9866085262 ద్వారా నేరుగా సమాచారం అందించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గవర్నర్‌పేట సెక్షన్ సిటీ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ విజయ టాకీస్ రోడ్డు ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం 23వ తేదీ శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఈఈ రవీంద్రబాబు ఓ ప్రకటనలో తెలిపారు. మూర్తి రోడ్డు, కూర్మయ్య రోడ్డు, నసరుల్లా ఖాన్ వీధి, హుస్సేన్ సాయిబ్ వీధి, మౌలానా వీధి, చెరుకుపల్లి వారి వీధి, మల్లాది వారి వీధి, కాశేశ్వర్ రావు వీధి, కోదండ రామిరెడ్డి వీధి తదితర ప్రాంతాలలో సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

న్యూఆర్ఆర్‌పేటలో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): సింగ్‌నగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని రైల్వే కాలనీ ఫీడర్ పరిధిలో వార్షిక తనిఖీలు, మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ పి.రవీంద్రబాబు, సింగ్‌నగర్ ఏఈ డి.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. న్యూరాజరాజేశ్వరీపేట అపార్ట్‌మెంట్స్, సుబ్బరాజు నగర్, సుందరమ్మదిబ్బ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని కావున ఆయా ప్రాంతాల్లోని వినియోగదారులు గమనించి తమకు సహకరించాలని వారు కోరారు.

మధురానగర్ సెక్షన్ పరిధిలో..

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ వైర్ల మరమ్మతుల దృష్ట్యా మధురానగర్ సెక్షన్ ఎస్‌వీఎస్ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీరు పి. రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రఘునాథరావు వీధి, కళ్లేపల్లి వారి వీధి, గొట్టుముక్కల వారి వీధి, బుద్ధంరాజు స్ట్రీట్, లైబ్రరీ రోడ్డు, ఆంజనేయస్వామిటెంపుల్ రోడ్డు, శ్రీదేవి బార్ రోడ్డు, పాత పోస్టాఫీసు రోడ్డు, రిలయన్స్ టవర్ రోడ్డు, బుడమేరు వంతెన, వెంకటేశ్వరస్వామి గుడి రోడ్డు, దర్గా రోడ్డు, రామకృష్ణాపురం మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ముత్యాలంపాడు సెక్షన్‌లో..

ముత్యాలంపాడు సెక్షన్ అయోధ్యనగర్ పరిధిలో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. కే దారేశ్వరపేట ఒకటో లైను నుంచి ఏడో లైన్ వరకు, లోటస్ సెక్టార్ వన్ నుంచి సెక్టార్ 5వరకు, రామలింగేశ్వరపేట జీరో లైన్ నుంచి ఏడో లైన్ వరకు, శాంతినగర్, అయోధ్యనగర్, బసవతారకనగర్, బుడమేరు కట్ట, సూరిబాబు కాలనీ, డొంక రోడ్డు, రామకృష్ణాపురం తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. విద్యుత్ వినియోగదారులు తమ సిబ్బందికి సహకరించాల్సిందిగా ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలోని పలు దేవాలయాలలో శుక్రవారం ప్రత్యేక పూజలు అర్చనలు జరిగాయి. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావటంతో ముత్యాలంపాడు శ్రీపార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీబాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవాలయంలోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారు, దావు బుచ్చయ్యకాలనీలోని శ్రీ శ్యామలాంబదేవి దేవాలయంలో అమ్మవారికి ప్రీతికరమైన కంకుమార్చనలు, శ్రీచక్రార్చనలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు, మహిళలు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా ఏపీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తులో ప్రపంచ విజ్ఞాన కేంద్రంగా రూపుదిద్దుకోనుందని ఏపీ టెక్నాలజికల్ సర్వీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం. సూర్యతేజ అన్నారు. కోడ్ స్పార్క్-2025 పేరుతో కేబీఎన్ కళాశాలలో జాతీయ స్థాయి హ్యాక్‌థాన్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సూర్యతేజ హ్యాక్‌థాన్‌ను ప్రారంభించి ప్రసంగించారు. విజయం సాధించడానికి పటిష్టమైన ప్రణాళిక అవసరం అన్నారు. అవకాశాలు అందిపుచ్చుకోవటం కాదని, అవకాశాలని తయారు చేసుకున్న వ్యక్తి విజేతగా నిలుస్తాడన్నారు.